ప్రజాశక్తి
మంగళవారం 23 మే 2023
5
అల్లూరి సీతారామరాజు

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: వేసవి సెలవుల్లో చిన్నారులు బయట వెళ్ళకుండా ఉండేందుకుగాను స్థానిక జిల్లా శాఖ గ్రంధాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ విజయవంతంగా జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు గత పది రోజుల నుంచి వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తుండడంతో చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొంటూ ఆటలాడుతున్నారు. సోమవారం గ్రంధాలయంలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారిని ఎస్.సునీత, సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

బొమ్మలు గీస్తున్న చిన్నారులు

ఫలించిన పోరాటం

- ఆసుపత్రుల శానిటేషన్ కార్మికుల సమ్మె సఫలీకృతం
- సమస్యల పరిష్కారానికి కాంట్రాక్టర్ లిఖితపూర్వక ఒప్పందం
- విధుల్లో చేరిన కార్మికులు, సిఐటియు నాయకులకు కృతజ్ఞతలు

అరకులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్మికులకు నిమ్మరసం ఇస్తున్న కాంట్రాక్టర్ నారాయణ

ప్రజాశక్తి-పాడేరు:తమ వేతన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాడేరు డివిజన్లోని ప్రభుత్వ ఆసుపత్రుల శానిటేషన్ కార్మికులు చేపట్టిన సమ్మె సఫలీకృతం అయ్యింది. గత మూడు రోజులుగా పాడేరు చింతపల్లి, అరకు, ముంచింగిపుట్టు ఆసుపత్రుల శానిటేషన్ కార్మికుల సుమారు 56 మంది విధులు బహిష్కరించి సమ్మె చేపట్టిన సంగతి విధితమే. గత కొన్నాళ్లుగా వేతన సమస్యలు ఎదుర్కొంటున్న ఈ శానిటేషన్ కార్మికులు ఎట్టకేలకు సమ్మె చేపట్టి తమ సమస్యలు పరిష్కరించుకోవడంలో విజయం సాధించారు. ఆసుపత్రి పారిశుధ్య కార్మిక యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులతో కాంట్రాక్టర్ (టివిటి) నారాయణ కార్మికుల సమస్యలపై గత రెండు రోజులు చర్చలు జరిపారు. ఎట్టకేలకు సమస్యలపై సానుకూలంగా స్పందించారు. అరకు, పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని కార్మికులకు నెలకు రూ.500 వేతనం, ముంచింగ్‌పుట్, చింతపల్లి ఆసుపత్రి కార్మికులకు నెలకు వేతనం రూ.700 పెంచడానికి అంగీకారం తెలిపారు. ప్రతి నెల కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించడానికి, అదనపు సిబ్బందిని నియమించడానికి, ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్య ల పరిష్కారానికి, వేతనంతో కూడిన సెలవులు మంజూరుకు, కార్మికులకు డ్యూటీ యూనిఫాంలు, పని సామగ్రి పరికరాలు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ అంగీకరించారు. రాతపూర్వకంగా శానిటేషన్ కార్మికుల యూనియన్ నాయకులతో.ఆమోదం తెలిపి తమ ఒప్పందాలను లిఖిత పూర్వకంగా కాంట్రాక్టర్ అందజేశారు. దీంతో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెను విరమించి 22 తేదీ సోమవారం నుండి ఆసుపత్రుల్లో శానిటేషన్ కార్మికులు తమ విధుల్లోకి ఉపక్రమించారు. సమ్మె విజయవంతానికి కృషి చేసిన కార్మికులకు సిఐటియు నాయకులకు ఆసుపత్రి పారిశుద్ధ కార్మిక సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుందర్రావు, కార్మికుల సంఘం నాయకులు ముత్యాలమ్మ, ఘటి, సుధారాణి, సింహాచలం, శివ, కాంట్రాక్టర్ నారాయణ, కిరణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచింగిపుట్టు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికుల సమ్మె నాలుగో రోజుకు చేరింది. చర్చలు సఫలం కావడంతో పారిశుధ్య కార్మికులు విధుల్లో చేరారు. తాత్కాలికంగా సమస్యలు పరిష్కారం అయినప్పటికీ భవిష్యత్తులో కనీస వేతన రూ.26000 ఇవ్వాలని పారిశుధ్య కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, సిఐటియు ఉపాధ్యక్షులు పి.భీమరాజు, గిరిజన సంఘం మండల కార్యదర్శి కే.నర్సయ్య, పి.రామదాసు, పారిశుద్ధ కార్మికులు సుబ్బలక్ష్మి, గాసన్న, కౌసల్య, నారాయణ, దేవి, వసంత, గిరిజన మహిళ సంఘం అధ్యక్షులు విజయ, ఈశ్వరి, మీనా, రాధా పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:అరకు ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు సోమవారం సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. సమ్మె విజయవంతానికి కృషి చేసిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, నేతలకు ఆసుపత్రి పారిశుద్ధ కార్మిక సంఘం అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికుల సంఘం నాయకులు రఘు, ద్రౌపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పాడేరు డివిజన్ పరిధిలో 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమై పోలీస్ భద్రత, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యం, బల్లలు. ఏర్పాటు చేయాలని సూచించారు. మెరుగైన పారిశుద్ధ్యపు పనులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రథమ సంవత్సరంలో 3177, ద్వితీయ సంవత్సరం 2187 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. ఈ సమావేశంలో డిఐఇఓ ఎస్.బెన్న స్వామి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పి.వి.ఎస్.మూర్తి, బి.ఆర్. వేద వ్యాస్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, పోస్టల్ సూపరింటెండెంట్ మురళి, ట్రాన్స్కో ఎడి ఇ.భాస్కరరావు పాల్గొన్నారు.

13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

కొయ్యూరు మండలంలో ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (బాలురు), అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, అరకువ్యాలీ ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు) అరకువ్యాలీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెదబయలు ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (ఎస్టీ బాలురు), హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాడేరు ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలికలు), జి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల, అప్పర్ సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జి.కె.వీధి ఎపిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (ఎస్టీ బాలికలు) కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తారు.

పెద్దల సమక్షంలో ప్రేమికుల వివాహం

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: మండల కేంద్రంలో మోదకొండమ్మ గుడి వద్ద పెద్దల సమక్షంలో ప్రేమ జంట సోమవారం వివాహం చేసుకున్నారు. పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ లాగ బూసి గ్రామానికి చెందిన కాతారీ సుమిత్ర, కొర్ర త్రినాథ్ గత కొద్దికాలం నుండి ప్రేమించుకుని బయటికి వెళ్లి పోవటంతో ఉభయ కుటుంబాల వారి వివాహానికి తిరస్కరించారు. దీంతో స్థానిక పెద్దలను ఆశ్రయించారు. వధూ వరులు దేవాలయం వద్ద పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రఘు, మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య, బో ర్గం అప్పారావుచ కొంటా రామారావు, బత్తిరి రామారావు, సింహాచలం, దామోదరం, వంశి, చెండా రామారావు పాల్గొన్నారు.

వివాహం చేసుకుంటున్న జంట

నిధుల కోతతో ఉపాధి నిర్వీర్యానికి కుట్ర

పని ప్రదేశంలో కానరాని సౌకర్యాలు
కూలీల సమస్యలను పట్టించుకోని యంత్రాంగం
సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

సిఐటియు ఆధ్వర్యాన పనిప్రదేశంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి -కొయ్యూరు: బడ్జెట్‌లో నిధుల కోత, పని విధానంలో మార్పుల పేరుతో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై అప్పలనాయుడు విమర్శించారు. సోమవారం మండలంలోని దౌనూరు పంచాయతీ తులబడ గ్రామంలో ఉపాధి పనిప్రదేశంలో కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఉపాధికి నిధులను భారీగా తగ్గించడంతోపాటు కేటాయించిన నిధులను ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, రహదారులు, ఇతరత్రా మెటీరియల్ పనులకు, యంత్రాలతో పనులకు బదలాయించడం వల్ల కూలీల ఉపాధి పనిదినాల తగ్గుతున్నాయన్నారు.

ఉపాధి నిధులకు కేవలం కూలీలకు వేతనాల చెల్లింపునకు వినియోగించడంతోపాటు, జాబ్‌కార్డున్న కుటుంబానికి ఏడాదిలో 200 పనిదినాలు ఉపాధి కల్పించాలని, రోజువారీ కూలీ రూ.600 కనీసం చెల్లాంచాలని, పనిప్రదేశంలో ప్రమాదాలు జరిగితే రూ.20లక్షలకు బీమా కల్పించాలని, గునపాలు, పారలు, ఇతర ఉపాధి పనిముట్లు ఇవ్వడంతోపాటు పనిప్రదేశంలో తాగునీరు మెడికల్ కిట్లు, నీడ సౌకర్యం కల్పించి, పాతపద్ధతిలో పని కల్పించాలని కోరారు. మేట్‌లకు స్మార్ట్‌ఫోన్లకు రూ.పదివేలు ఇవ్వాలని, కోరారు.కార్యక్రమంలోతాంబేలు చిట్టిబాబు, వార్డు మెంబర్ బంగారమ్మ, అంపురి బుజ్జిబాబు, లక్ష్మి, జాన్, వంతల అప్పారావు, జోసఫ్, పౌల్, రిబిక పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న సిపిఎం సర్పంచ్ సరోజిని, సిపిఎం నేత సత్యనారాయణ

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ ఉమ్మడివరం గ్రామంలో కూర్సం ముత్తయ్య చెరువులో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సిపిఎం సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ సందర్శించారు. పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధి పనిభారాన్ని పెంచి, కూలీలకు ఈ పథకాన్ని దూరం చేయాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని దుయ్యబట్టారు. ఉపాధి చట్టంలోని నిబంధనల ప్రకారం పనికల్పన, వేతనాలు చెల్లింపు, వికలాంగులకు ప్రత్యేక రాయితీ, వేసవి అలవెన్స్, పనిముట్లకు పరిహారం, పనిప్రదేశంలోతాగునీరు, మందులు, టెంట్‌లు ఇతర సౌకర్యాలేవీ కల్పించడకుండా, కూలీలను కష్టాలకు కోరి వారే పనికి రాకుండా చేసే పరిస్థితులు కల్పించడం దుర్మార్గమన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని అదే స్ఫూర్తితో ఉద్యమించి, పరిరక్షించుకుంటామని పిలుపునిచ్చారు.

నిధుల లేమితో నిస్సహాయ స్థితి..

గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు

మాట్లాడుతున్న సర్పంచ్ బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు: పేరుకే సర్పంచ్‌నని, పంచాయతీలో నిధులు లేక ఏ పని చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నానని జికె.వీధి మండలం గాలికొండ సర్పంచి బుజ్జిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, అయినా నిధులు లేక ప్రజల దాహార్తిని తీర్చలేకపోతున్నానన్నారు మొదటిసారిగా సర్పంచ్‌గా ఎన్నికైనందుకు ఎంతో ఆనందం పొందానని, గ్రామంలో ప్రజా సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులను చేపట్టి మంచి పేరు తెచ్చుకోవాలని ఎంతో ఆశించానన్నారు. అయితే ఇపుడు నిధుల కొరతతో ఏ ఒక్క పని చేయలేని దుస్థితిలో ప్రజలకు ముఖం చూపించాలంటే సిగ్గేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, గ్రామాల్లో సమస్య పరిష్కారానికి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ు తక్షణమే నిధులు మంజూరు చేయాలని, సర్పంచ్‌లతో పనిచేయించడం ప్రభుత్వానికి ఇష్టం లేకుంటే అధికారులతో ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

పోలవరం నిర్వాసితులకు న్యాయం కోసం
సిపిఎం ఆధ్వర్యాన మహా పాదయాత్ర

- వచ్చే నెల 20న ఎటపాకలో ప్రారంభం
- విజయవాడకు పాదయాత్రలో ఇంటింటా ఒక్కొక్కరు పాల్గొనాలి
- పరిహారం అందేవరకు పోలవరం ఆపాలని 1న ఊరూరా గ్రామసభల్లో తీర్మానాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-ఎటపాక : పోలవరం ముంపుబాధితులు, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం పోరాడుతుందని, అందులో భాగంగా వచ్చేనెల 20న ఎటపాక నుంచి ముంపు మండలాల మీదుగా విజయవాడ వరకు సిపిఎం ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ వెల్లడించారు. సోమవారం తోటపల్లిలో ఆకిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన మండలస్థాయి విస్తృత సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ 16ఏళ్ల క్రితమే సిపిఎం పోరాటం చేసిందని, అదే ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ పోలవరం నిర్వాసితులకు, ముంపు బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ జూన్ 20 నుండి సిపిఎం మహా పాదయాత్ర కు చేపడుతుందన్నారు. ఎటపాక మండలం విజయవాడ వరకు ముంపు మండలాల మీదుగా సాగే పాదయాత్రలో నిర్వాసిత కుటుంబం నుంచి కనీసం ఒక్కొక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటం చేయకుంటే, నిర్వాసితులకు న్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసితులను పట్టించుకోకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్మాణాన్ని పూర్తిచేస్తున్నారన్నారు. 2022 జూలై వరదలకు సర్వం కోల్పోయిన వారికి నేటికీ నష్టపరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జూన్ 1నుండి నిర్వాసితులకు, వరద బాధితుల సమస్యలపై ప్రతి పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయాలని సూచించారు. గతేడాది వరద సహాయక చర్యల్లోనూ, బాధితులను ఆదుకోవడంలోనూ ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. అలాంటివి పునరావతం కాకుండా ముందస్తు వరద సహాయక చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కార్యాలయం ఎదుట ఒక రోజు దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, మండల కమిటీ సభ్యులు డేగల మాధవరావు, పులుసు బాలకృష్ణ, సోయం వీరమ్మ, ఐ.పద్మ, సొందె రామారావు, కారం జయమ్మ, గద్దల హుస్సేన్, బుద్ధుల భద్రయ్య, హరనాధ్, ఇరపా సత్యం, శాఖ సభ్యులు అపకా సమ్మక్క, లింగాల వెంకన్న, తోట శ్రీను, పసుపులేటి ప్రవీణ్, తెల్లం చినరాజు, సోయం పెదబాబు,పి. సరవయ్య పాల్గొన్నారు.

పాదయాత్ర చేపడుతున్న గిరిజన సంఘం నేతలు

రోడ్డు సౌకర్యం కల్పించాలని
గిరిజన సంఘం పాదయాత్ర

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీలో గొడుగురాయి గ్రామం నుండి గేమ్మెలి సచివాలయం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సోమవారం గిరిజన సంఘ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం సచివాలయంను ముట్టడి చేసి ఇంజనీరింగ్ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం రాక ముందు నుండి ఈ గ్రామంలో 25 కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందికరంగా ఉందని, వైద్యం కోసం అంబులెన్స్ రాలేదని తెలిపారు. ఇక్కడ గిరిజనులు పండించే పంటలు మార్కెటింగ్ కు తీసుకువెళ్లి అమ్ముకునే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సందించి వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశలవారీగా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వనుగు సన్యాసిదొర, నాయకులు వంజరి పిన్నంనాయుడు, పాంగి వెంకట్, అరగడ శ్రీలత, సత్తిబాబు, చిన్నబ్బాయి, గ్రామస్తులు వండలం అప్పన్నదొర, కోరాబు సింహాచలం, వంజరి వలసంనాయుడు, శరత్ కుమార్, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సోమవారం ఆందోళన చేపట్టింది. ఆ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి పాచిపెంట .శాంతకుమారి ఆధ్వర్యన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎస్టీ జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం పొందుపరచడం విడ్డురమని, తక్షణమే ఉప సంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సంతకాల సేకరణ పూర్తి అయిన అనంతరం రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. ప్రభుత్వంలో మార్పు రాకపోతే అమరావతిలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాంగి శాంతా రావు, పంచాడి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న నాయకులు

స్పందనలో 21 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ జనరల్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలతో వచ్చిన దరఖాస్తుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టనున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ.ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశపు మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి, స్పందన నిర్వహించి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా 21అర్జీలు వచ్చినట్లు ఎపిఒ తెలిపారు. గతేడాది పదిమంది గిరిజన రైతులకు రూ.12లక్షల జీడిపిక్కల బకాయి ఉందని, దాన్ని చెల్లించే చర్యలు చేపట్టాలని ముర్ల రామ్‌రెడ్డి. ముర్ల కామరాజు. ముత్యాల రామిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. మూడు నెలల క్రితం జరిగిన బైక్ ప్రమాదంలో చేయి కోల్పోయిన తనకు వికలాంగ పింఛను మంజూరు చేయాలని ప్రత్తిపాడు మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బిత్తర దివ్య దరఖాస్తు సమర్పించారు.భూ సమస్య పరిష్కరించాలని అడ్డతీగల మండలం వేటమామిడికి చెందిన దూడ కనకరత్నం, పోలవరం ముంపు బాధితులకు 18ఏళ్ల ప్యాకేజీ మంజూరు చేయాలని దేవీపట్నం గ్రామానికి చెందిన మల్లాడి రామకృష్ణ దరఖాస్తు సమర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజ్, ఇఇలు .జి. దేవిడ్‌రాజు, నాగేశ్వరరావు వెలుగు పిఎఒ రాంబాబు, సిడిపిఒ సంధ్యారాణి. ఎఎంఒ సి. శ్రీహరి, ఎడిఎంహెచ్ఒ డాక్టర్ అనూష, వైద్యాధికారు డాక్టర్ కల్పన. డిఇఇలు. సాయి సతీష్, ఎ.వెంకటేశ్వరరావు, రాజేంద్రబాబు, రామచంద్రమూర్తి. దుర్గాప్రసాద్, ఎడిఎ.సిహెచ్ కెవి చౌదరి, సావిత్రి, .డిడి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, డిటిలు సత్యనారాయణ. రవీంద్రబాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు టిడిపి వితరణ



బాధితులకు సాయాన్ని అందజేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని పెదశీతనపల్లి పంచాయితీ బొడ్రాయిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులకు టిడిపి నేతలు బాసటగా నిలిచారు.విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి,ప్రధాన కార్యదర్శి మలెళ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పొదిలి రామారావు.యూత్ అధ్యక్షులు గడ్డం సురేష్ చౌదరి.శీలం తమయ్.పి. సాల్మన్ రాజ్ ఇతర నేతలు సంఘటనా ప్రదేశానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబీకులు మీడియం భద్రమ్మ, పులి బ్రహ్మయ్య, పులి కన్నయ్య తదితర ఏడు బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. బాధితులకు బట్టలు. నిత్యవసర వస్తువులు బియ్యం తదితర సామగ్రి అందజేశారు.

నేటి నుంచి అడ్మిషన్లు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో శారదా నికేతన్ (ఇంగ్లీష్) మీడియం స్కూల్లో ఎల్‌కెజీ నుంచి 5వ తరగతి వరకు 2023-24 విద్యా సంవత్సరం గాను ఈనెల 23 నుండి అడ్మిషన్స్ జరుగుతున్నాయి గిరిజన ప్రాంతంలో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం లో అతి తక్కువ ఫీజులతో జాయినింగ్ చేసుకుంటామని ఒక ప్రకటనలో పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఎల్ కె జి నుండి 5వ తరగతి వరకు ప్రతి తరగతిలో 30 సీట్లను కేటాయించినట్లు పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు ఫోన్:6303072991, 9492447551 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మైనింగ్ అనుమతులు ఇవ్వొద్దని ఆందోళన

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం చీమల పాడు శివారు కళ్యాణపులోవ రిజర్వాయర్ పరీవాహక ప్రాతంలో నూతన మైనింగ్‌లకు అనుమతులు ఇవ్వవద్దని చీమలపాడు పంచాయతీ శివారు ఆదివాసీ గ్రామాల ప్రజలు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ప్రతినిధులు సోమవారం రావికమతం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీలు మాట్లాడుతూ, గతంలో ఉన్న మైనింగ్ కంపెనీలతో రిజర్వాయర్ ఉనికికి ప్రమాదం ఏర్పడిందని, దీనిపై ఎన్నో పోరాటాలు చేశామన్నారు. కొత్తగా మరో కంపెనీకి అనుమతులిచ్చేందుకు అధికార్లు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తాటిపర్తి, ఆజేయపురం, కడగెడ్డ తదితర గ్రామాలలో ప్రజలకు మార్చి, ఏప్రిల్ నెలలకు సంబందించి రేషన్ అందలేదని అధికార్లు వచ్చి విచారణ చేశారని, ఇప్పటికీ రేషన్ ఇవ్వలేదని పేర్కొన్నారు. అధికార్లు తక్షణం చర్యలు చేపట్టాలని ఆ సంఘ నాయకులు మోసూరి రాజీబాబు, సెగ్గె నానిబాబు, పెదరాజు, ఆదివాసీలు కోరారు.

గృహ నిర్మాణ సమస్యలు తెలపాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు సంబంధించి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కారానికి కృషి చేస్తామని హౌసింగ్ ఏఈ డిఎ రాజు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో జగనన్న ఇళ్ల కాలనీలకు సంబంధించి, సొంత స్థలాల్లో గృహాలు నిర్మించుకునే వారికి ఎటువంటి సమస్యలు ఉన్నా మండల స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. హౌసింగ్ మెటీరియల్, పెండింగ్‌లో బిల్లులు, లే అవుట్లలో ఉన్న ఇతర సమస్యలను గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తెలియజేయాలని ఆయన సూచించారు. లేని పక్షంలో మండల ఏఈ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని, తమ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను వెను వెంటనే పరిష్కరిస్తామన్నారు. తమ పరిధిలో లేని సమస్యలు ఉంటే వాటిని గుర్తించి జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి సోమవారం గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు .

వైద్య సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామంలో సోమవారం పిహెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్, సుకన్య ఆధ్వర్యంలో ప్రపంచ ఎంక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎంక్లాంప్సియా (గుర్రపు వాతం) వచ్చే వ్యాధి, నివారణ చర్యలు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రసాద్, కుమారి, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి సైతార్‌పేట, సర్వసిద్ధి గ్రామాల్లో "వరల్డ్ ప్రీ ఎక్లాంప్షియా డే" పురస్కరించుకొని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ ఎస్ వి శక్తి ప్రియ, వాసంతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి ప్రియ మాట్లాడుతూ, గర్భిణీల్లో ప్రీ ఎక్లాంప్షియ లక్షణాలు కనిపిస్తాయని, బిపి పెరగడం, అధిక ప్రోటీన్ కారణంగా సంభవిస్తుందన్నారు. సమయానికి మంచి ఆహారం తీసుకొని, నిద్ర పోవడంతో పాటు సంగీతం విని, ఒత్తిళ్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు తంటపురెడ్డి నాగేశ్వరరావు, సత్యనారాయణ, మలేరియా ఇన్చార్జ్ నోడల్ ఆఫీసర్ పి ఎన్ వి ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

బూత్ లెవెల్ అధికారులతో సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జానికమ్మ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి ఓటర్‌ను ఆధార్కు అనుసంధానం చేయాలని సూచించారు. బూత్ లెవెల్లో సమస్యలు ఏమైనా ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.

ఆదివాసీ సాంస్కృతిక సంబరాలను జయప్రదం చేయాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ: జూన్ 6, 7, 8 తేదీల్లో ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకు లోయలో నిర్వహించ తలపెట్టిన ఆదివాసి గిరిజన సంస్కతిక సంబరాలను విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,గిరిజన, వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.ఏపీ గిరిజన సంఘం ఎనిమిదవ రాష్ట్ర మహాసభలు నిర్వహణ సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో గిరిజన సంస్కతిక సంబరాల నిర్వహణ సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, గిరిజన ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను, కళలు భావ్య ప్రపంచానికి తీసుకుని వచ్చి వాటిని కాపాడవలసిన బాధ్యత, ఆవశ్యకత ప్రతి ఒక్కరిలో ఉందని సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ పెరుగుతున్న నేటి తరుణంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. ఆట, పాట, మాట అనే కార్యక్రమం ద్వారా సంబరాలు నిర్వహించి గిరిజన సంస్కతిని సంప్రదాయాలు, ఆచార్య, వ్యవహారాలను భావ్య ప్రపంచానికి తెలియజేయాలని నిర్ణయించారు. గిరిజన సంస్కతి, సంప్రదాయాలను కాపాడుకుంటేనే భవిష్యత్తులో గిరిజనుల మనుగడ ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో పాశ్చాత్య సంస్కృతి వెంటాడుతుందన్నారు. సంబరాలకు ప్రతి ఒక్కరు ఆర్థికంగా సహకారం అందించి వాటి నిర్వహణకు తమ వంతు సహాయ సహకారాలు సలహా సూచనలు అందించి విజయవంతం చేయాలని వారు కోరారు.యుపిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రఘునాథ్, జిల్లా గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు, నాయకులు నారాయణరావు, బొంజుబాబు, మానవ హక్కుల నేర నిరోధిక సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మ, ఉద్యోగుల సంఘం నాయకులు నందో, అంబేద్కర్ సేవ సంఘం నాయకులు లైకోన్, గోవర్ధన్, కిల్లో గూడ హెచ్ఎం వి.త్రినాధరావు, కొర్రా ఏలియా, ఎరుకుల మాస్టారు, బొంజు నాయుడు, ఆదివాసి పరిరక్షణ సమితి నాయకుడు చట్టు మోహన్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, మండల అధ్యక్షులు బుజ్జిబాబు, రామారావు, అప్పన్న, ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ జోషి, దండ కారణ్య విమోచన సమితి నాయకులు కే. ప్రసన్న, వర్తక సంఘం అధ్యక్షులు కాపుగంటి కృష్ణారావు, మాజీ ఎంపిటిసి దురియస్ సాయిబాబా, గిరిజన విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షులు పోతురాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జీవవైవిధ్యాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా వాసన్ స్వచ్ఛంద సంస్థ, రైతు సాధికారిక సంస్థ, రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ సంయుక్తంగా సోమవారం స్థానిక కాఫీ హౌస్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవవైవిధ్యానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సహజ వనరులను పరిరక్షించుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే అల్లూరి జిల్లాలో తాగునీటి సమస్య అధికంగా ఉందని ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, వ్యవసాయ శాఖ ఇతర అనుబంధ శాఖలు కాఫీ లైసెన్ వర్కర్లతో కలిసి గ్రామస్థాయిలో జీవ వైవిధ్యాన్ని పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ అధికారి పాత్రో మాట్లాడుతూ, పంటల వైవిధ్యానికి సుస్థిర వ్యవసాయం అభివృద్ధికి పశుసంవర్ధక శాఖ అనుసంధానంతో కృషి చేస్తామని చెప్పారు. రైతు సాధికార సంస్థ డిపిఎం భాస్కరరావు మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తతం చేస్తున్నామని తెలిపారు. వాసన్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు, రైన్ ఫారెస్ట్ అలియన్స్ ప్రతినిధి శ్రీధర్, సంజీవిని సంస్థ ప్రతినిధి దేవుళ్ళు, అమృత సంస్థ ప్రతినిధి మురళి, ఆదివాసి మిత్ర సంస్థ ప్రతినిధి మన్మధరావు, కోవెల్ ఫౌండేషన్ ప్రతినిధి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఈనెల 23 నుంచి 31 వరకు జరిగే మొబైల్, ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సుంకపూర్, పాములవాక, ఎండపల్లి, తంగేడు, రామచంద్రపాలెం, చిన్నబొడ్డేపల్లి, గ్రామాలలో జరిగే క్యాంపులలో ఆయా ప్రాంతానికి సంబంధించిన ప్రజలు ఆధార్‌ను అప్డేట్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆయా ప్రాంతాల సచివాలయాలను సంప్రదిం చాలన్నారు.

నేరాలు ఘోరాలు

సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పాత జోగంపేట నుండి సాలికి మల్లవరం, పొగచెట్లపాలెం, వెంకటాపురం గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లు ఐదు అడుగుల కంటే కిందికి వేలాడటంతో సరుగుడు తోట దగ్ధమైంది.సాలిక మల్లవరం గ్రామానికి చెందిన పెదిరెడ్ల మల్లేశ్వరరావు సరుగుడు తోట సుమారు ఎకరం కాలి బూడిదయింది. తెల్లవారుజామున వీచిన గాలికి విద్యుత్ మంటలు రావడంతో ఈ సంఘటన జరిగిందని చుట్టుపక్కల రైతులు వాపోతున్నారు. కాగా ఈ విషయమై గొలుగొండ విద్యుత్ అధికారులకు, లైన్మెన్‌లకు, డివిజన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వేలాడుతున్న విద్యుత్ వైర్లపై పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు.ఈ చుట్టుపక్కల వ్యవసాయం చేసే వారంతా భయం గుప్పెట్లో వ్యవసాయం చేయవలసి వస్తుందని, ఎప్పుడు ఏమవుతుందో తెలియక ఆందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో సుమారు రెండు లక్షల వరకు నష్టపోవాల్సి వచ్చిందని రైతు గుగ్గోలు పెట్టాడు. జీడి మామిడి తోటలగుండా వెళ్లే కూలీలు, రైతులు, కరెంటు తీగలకు భయపడి పిక్కలు ఏరలేక తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు కోరారు.

టేకు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: అక్రమంగా తరలించేందుకు రహస్య ప్రదేశంలో దాచి ఉంచిన టేకు దుంగలను సోమవారం గొలుగొండ అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ కు చెందిన ఓ వ్యక్తికి గొలుగొండ మండలం దారమటం సమీపంలోని పాత మల్లంపేట రెవిన్యూ పరిధిలో సుమారు 60 ఎకరాలలో టేకు తోటలు ఉన్నాయి. ఈ టేకు తోటలలో నాలుగు రోజుల క్రితం కొంతమంది వ్యక్తులు టేకు చెట్లను నరికించి తరలించడానికి దాచారు. సమయం చూసుకొని వీటిని పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రహస్య ప్రదేశానికి తరలించారు. ఈ విషయమై బాధితులు అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు సోమవారం ఉదయం అక్రమంగా దాచి ఉంచిన టేకు దొంగలను స్వాధీనం చేసుకుని గొలుగొండకు తరలించారు పట్టుకున్న కలప విలువను అంచనా చేస్తున్నామని అటవీసెక్షన్ అధికారి లక్ష్మణ్ తెలిపారు.

రోడ్డు పనులపై ఆరా

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోటలో శివాలయం వీధి రహదారికి ప్రత్యామ్నాయంగా వేస్తున్న రహదారిని తహసీల్దార్ మహేశ్వరరావు సోమవారం పరిశీలించారు. స్థానిక పాత పిహెచ్సీ, 1వ వార్డుల నుంచి మూడు వార్డుల ప్రజల ఉపయోగపడే ఈ రహదారిని వేసేందుకు రెండు రోజులు క్రితం ప్రారంబించారు.రహదారి పక్కనున్న కొంత మంది రైతులు అభ్యరతరం తెలపడంతో పనులు ఆగాయి. దీంతో, తహసీల్దార్ ఆ రహదారిని సోమవారం పరిశీలించారు. అభ్యంతరం తెలిపే వారు తమ వద్దనున్న పత్రాలతో కలవాలని సూచించారు. సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని గ్రామ సర్వేయర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చిన్నబాయి, సర్పంచ్ కొన లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో గొట్టువాడ శివారు అరకు గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని సోమవారం ఆ గ్రామానికి చెందిన గిరిజనులు ఎంపీడీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా చిద్రమైందని, దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన గర్భిణీకి సకాలంలో వైద్య పరీక్షలు అందక మరణించిన విషయాన్ని పేర్కొన్నారు. ఈ మార్గంలో కనీసం కాలినడకన వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా ఉందని, అధికారులు తక్షణమే స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

ప్రజాశక్తి-మాడుగుల: మాజీ సర్పంచ్ వేమవరపు వెంకటరమణకు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, పంచాయతీ అభివృద్ధికి వెంకటరమణ ఎంతో కృషి చేశారని కొనియాడారు. స్వచ్ఛమైన రాజకీయ నాయకుడిగా పేరు పొందారని, ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కురచ నరసింగరావు, ఎంపీపీ పెదబాబు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముంపు గ్రామం నుంచి సురక్షిత ప్రాంతానికి పడవపై వెళ్తున్న బాధితులు (ఫైల్‌ఫొటో)

ముంపు బాధితులకు నేటికీ అందని పరిహారం

- ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి: విఆర్ పురం: గతేడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి వరద ముంపు బారిన పడిన బాధిత కుటుంబాలకు సిఎం జగన్మోహనరెడ్డి ప్రకటించిన రూ.పది వేలు పరిహారం ఎపుడిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వరదల సమయంలో ఊరూవాడా వదిలి, కొండలు, గుట్టల్లో తలదాచుకున్న బాధితులకు అప్పట్లో రెండు టమోటాలు, రెండు ఉల్లిపాయలు, ఒక నూనె ప్యాకెట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని, వరదలొచ్చి దాదాపు ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు బాధితుల వైపు కన్నెత్తిచూసే దిక్కు లేకుండా పోయిందని వాపోతున్నారు. మళ్లీ జూన్ నెల వచ్చేస్తుండడంతో ముంపుబాధితులు, పోలవరం నిర్వాసితులు మళ్లీ బిక్కుబిక్కుమంటున్నారు. మునుపెన్నడూ లేని విధంగా గతేడాది జూన్‌లోనే గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో కూనవరం, వర రామచంద్రాపురం మండలాల ప్రజలు ముంపుబారిన పడి, సర్వం కోల్పోయి కట్టుబట్టలతో చెట్టుకొకరు, పుట్టకొకరు తిండీతిప్పలు, తాగునీరు లేకుండా అడవుల్లో తలదాచుకున్న సందర్భాన్ని గుర్తు తెచ్చుకుని వణికిపోతున్నారు. వరదలు వెలిసి, ఏడాదౌతున్నా ఇప్పటికీ గతేడాది సిఎం జగన్ ప్రకటించిన రూ.10వేలు పరిహారం ప్రకటన ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలో ఇంటింటా పోస్టల్ ఖాతాలే లక్ష్యం

ప్రజాశక్తి-చింతూరు : మన్యవాసులకు పోస్టల్ సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో వన జనధన్ (గిరిజన ప్రాంత ఆర్థిక చేరిక) పేరుతో వందరోజుల పోస్టాఫీస్ చిన్న మొత్తాల పొదుపు, బీమా సేకరణ కార్యక్రమం చేపట్టిందనీ చింతూరు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.నారాయణ తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక పోస్ట్ ఆఫీస్ పొదుపు ఖాతా, దానితోపాటు బీమా పాలసీ ప్రారంభించడం లక్ష్యంగా దీఈనెల రెండవ తేదీ నుండి ఆగస్టు 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. 100శాతం గిరిజన కుటుంబాల చేరికతో ఆగస్టు 9న గిరిజన దినోత్సవం జరపుకోవాలన్నదే లక్ష్యంగా వెల్లడించారు. చింతూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని 754 ఆవాసాల్లో సుమారుగా 85,027ఇళ్లల్లో వందశాతం ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎఎస్‌పి నారాయణ. పిలుపునిచ్చారు.

ఘనంగా జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జీవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్ పి.ఉష అన్నారు. సోమవారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీలో వైజాగ్ ఎన్‌జివోస్ ఫోరంతో కలిసి జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక జాతుల జీవులు అంతరించిపోతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బయోడైవర్సిటీ బోర్డ్ రీజనల్ కో-ఆర్డినేటర్ జానకిరామ్, వైజాగ్ ఎన్‌జివోస్ ఫోరం కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్, గ్రీన్ క్లైమేట్ టీమ్ ప్రతినిధి జెవి.రత్నం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పిచ్చుకల గూళ్లు, పక్షులకు నీరు పెట్టే పాత్రలు పంపిణీ చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కురుపాం మార్కెట్, టౌన్ హాల్ రోడ్డు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, కోటవీధి, పెరివీధి, ఫిషింగ్ హార్బర్, కొప్పుల వీధి తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధులలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని అన్నారు

తునికాకు డబ్బులు వెంటనే చెల్లించాలి

ఆన్‌లైన్ పేమెంట్లు అంటూ బోనస్‌కు ఎగనామం
లబ్ధిదారులు, సిపిఎం నేతల ఆందోళన

తునికాకు కల్లాల్లో కూలీల సమస్యలు వింటున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- చింతూరు : తునికాకును సేకరించి, విక్రయిస్తున్న కూలీలకు కల్లాల్లోనే నగదు చెల్లింపులు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం కల్లేరు, మదుగురు, గ్రామాల్లోని తునికాకు కల్లాలను సందర్శించి, కార్మికులతో మాట్లాడారు. గిరిజనులు సేకరించి, విక్రయిస్తున్న తునికాకుకు సంబంధించిన డబ్బులను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఆన్‌లైన్‌లో వేయాలని అటవీశాఖ అధికారుల సూచనలతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులు కాకుండా, మునుపటిలా ఎప్పటికప్పుడు కల్లాల్లోనే తూనికాకు కట్టల డబ్బులు చెల్లించాలని కోరారు. ఈ మేరకు డిఎఫ్ఒకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. గతంలోనే ఇదేమాదిరిగా ఆన్‌లైన్ పేమెంట్లు అంటూ, ఏడేళ్లకు సంబంధించిన బోనస్‌లను ఇవ్వకుండా లబ్ధిదారులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు.అదీగాక ఎప్పటికప్పుడు తునికాకు చెల్లింపులు జరిగితే గిరిజనుల కుటుంబపోషణకు ఆసరాగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో తునికాకా పేమెంట్లు వారాంతంలో కల్లాల్లోనే ఆఫ్‌లైన్‌లో చెల్లించడంపాటు పూర్వపు బోనస్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి, సంతోష్, సిపిఎం నాయకులు కుంజా సీతారామయ్య, సోడే రెడ్డి, పాడ్రుం మహేష్, సోయం రాజులు, సోయం నారాయణ, ఒగ్గేలా గంగారాజు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్ట్ వల్ల గోదావరి, శబరి పరివాహక ప్రాంతాలలో సీజన్‌లో వరదలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అన్నారు. ఏటా జూన్, జులై నెలల్లో వరద సమస్య ఉత్పన్నమై ఆగస్టు, సెప్టెంబర్ వరకు దాని ప్రభావం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ముందస్తుగానే నాలుగైదు నెలలకు సరిపడా బియ్యం నిల్వలు, మంచి నూనె కందిపప్పు వంటి నిత్యావసరాలు ముంపు లేని గ్రామాల్లో నిల్వ చేయాలని కోరారు.

కూటూరు, పెదర్కూర్, కోతులగుట్ట, నర్సింగపేటతదితర ముంపు ప్రభావం అంతగా లేని గ్రామాల్లో ముందుగానే వీటిని స్టాక్ చేయాలని అలాగే టార్పాలిన్లు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కోరారు

ఆపత్కాల రహదారిని బాగుచేయండి

గోదావరి, శబరి వరదలు ముంచెత్తితో పరివాహక ప్రాంతాల్లో ప్రజలు బయటకు వచ్చే పరిస్థితులేక రహదారులు మూతపడతాయని, అటువంటి పరిస్థితిలో కోతులగుట్ట నుండి ఏడుగురాళ్లపల్లి మార్గమే ఒక్కటే దిక్కు అన్నారు. ఆపత్కాల ఈ రహదారిని ఎద్దెవా బురదగూడెం నుండి వేకవారి గూడెం వరకు రోడ్లు నిర్మించాలని కలెక్టర్ ఆదేశించినా పనులు జరగలేదన్నారు. దీనిపై అనేకసార్లు వినతులు ఇవ్వడంతోపాటు సమస్యలపై పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన లేదన్నారు. గోదారి నీటిమట్టం 40అడుగులకు చేరితే, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి, అంధకారం అలుముకునే పరిస్థితుల్లో ఎత్తైన ప్రదేశాల మీదుగా ముంపు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, మురళికృష్ణ, పాయం సత్యనారాయణ, కుంజ రాధ, కర్నాటి శ్రీనివాసరావు, బి.సుబ్బయ్య, తెల్లం తమ్మయ్య, పి.జ్యోతి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైసిపి నాయకుల భూదందా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భీమిలి మండలంలోని ఆరు గ్రామాలలో ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్న రైతులను మోసగించి వారి భూములను స్వాహా చేయడానికి అధికార వైసిపి నాయకులు కుట్రలు చేస్తున్నారని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమిలి మండలంలోని నారాయణరాజు పేట, అల్లు పేట, మజ్జి పేట, సింగనబంద, లక్ష్మీపురం గ్రామాల్లో రైతులకు చెందిన రికార్డులను వైసిపి నాయకులు మార్పు చేసి భూకబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. తాత, ముత్తాతలు దగ్గర నుంచి అనేక సంవత్సరాలుగా రైతులు వారి పేరున రికార్డులు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన 250 మంది రైతులు సర్వే నెంబర్ 1 నుంచి 85 సబ్ డివిజన్లులో450 ఎకరాల భూమిని సాగు చేస్తున్నారన్నారు. అన్ని రికార్డుల్లో వీరి పేర్లే ఉన్నాయన్నారు. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే ప్రొద్బలంతో రెవెన్యూ వారు దొంగ సర్వే చేశారని, ఆ సర్వేలో వీరి పేర్లు తొలగించి వైసిపి నాయకులు దాట్ల పెదబాబు, స్థానిక సర్పంచ్ సూర్యనారాయణ పేర్లు నమోదు చేశారని తెలిపారు. ఈ భూముల విలువ సుమారు రూ.4 వేల కోట్లు ఉంటుందని, భూములు హైవేకు దగ్గరగా ఉన్నాయని తెలిపారు. ఆ భూముల్లో అమాయక రైతుల పేర్లను తారుమారు చేసి వైసిపి నాయకులు దుర్మార్గ చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. వారికి సహకరించిన అధికారులను కఠినంగా శిక్షించాలని, నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రైతుల పక్షాన ఉండకుండా దాట్ల పెదబాబు మీద కనికరం చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకోవాలన్నారు.

ఇంటింటా దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా నివారణకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - విఆర్ పురం: మండలంలో మలేరియా నివారణలో భాగంగా కేసులు ఎక్కువగా ఉన్న గ్రామాలలో సోమవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ మేరకుఉమ్మడివరం గ్రామంలో రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని ఆధ్వర్యంలో దోమల నివారణి పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ, ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తద్వారా దోమలు,వాటి లార్వాల వృద్ధిని అరికట్టడం ద్వారా దోమలు కుడితే వచ్చే మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. ప్రస్తుతం వేసవి సీజన్‌లో ప్రజలు బయటకు వెళ్లాల్సి వస్తే వడదెబ్బ తగలకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం.సత్యనారాయణ సూపర్వైజర్,మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రాజేష్,హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎం, ఎఎల్‌హెచ్‌పి, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో వెంకన్న ఆలయం, కల్యాణ మండపం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని రంపచోడవరంలో దేశంలో మరెక్కడా లేని విధంగా రూ.పది కోట్లతో వెంకటేశ్వర ఆలయం, కల్యాణమండప నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వెల్లడంచారు. సోమవారం రంపచోడవరంలో రూ 2 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణపనులకు, రంపచోడవరంలో టిటిడి నూతనంగా నిర్మించిన వుంకటేశ్వరస్వామి ఆలయ మహాసంప్రోక్షణను వైవి.సుబ్బారెడ్డి దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిఎం జగన్ ఆదేశాల మేరకు రంపచోడవరంలో రూ.7.50కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణం, రూ.50లక్షలతో ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మహాసంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపి మార్గాని భరత్, ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్‌పిటిసి పండ వెంకటలక్ష్మి. బేబీ రాణి. వైస్ ఎంపిపిలు కె.బాలకృష్ణ, పండ కుమారి. తహశీల్దార్ పి వెంకటేశ్వరరావు. ఎంపిడిఒ ఎంవిఆర్ కుమార్‌బాబు. కారుకోడు పోచమ్మ, ఉలవల లక్ష్మి పాల్గొన్నారు

బిజెపి, వైసిపి అరాచక పాలనపై పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాల అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గనాయుడు పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సిపిఎం విశాఖ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ మోడీ ప్రభుత్వం దేశంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. అంబానీ వంటి కార్పొరేట్లకు బహుళ ప్రయోజనాలు చేకూర్చుతోందన్నారు. నల్లధనం వెలికితీత హామీ ఏమైందని మోడీ సర్కారును ప్రశ్నించారు. పెద్ద నోట్ల రద్దు విఫల ప్రయోగమని తేలినా, మరలా రూ.2 వేల నోట్ల రద్దు చేస్తామని ఆర్‌బిఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. దీనివల్ల కూడా సంపన్నులకు తప్ప దేశ ప్రజలకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదన్నారు. మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషన్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడినా చోద్యం చూడటం దారుణమన్నారు. అతనిపై చర్య తీసుకోవాలని రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా మోడీ ప్రభుత్వం ఇంతవరకు ఏ చర్యా తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్రంలో పోరాడేవారిపైనా, కార్మికులపైనా వైసిపి ప్రభుత్వం నిర్బంధాన్ని తీవ్రం చేయడం ఆందోళనకరమన్నారు. విశాఖలో చట్టపరంగా కనీస వేతనాలు అమలు చేయాలంటూ ఆందోళన చేసిన మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు, యూనియన్ నాయకులపై బైండోవర్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. క్లాప్ డ్రైవర్లకు నెలకు రూ.18,500 జీతం చెల్లించాలని లేబర్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చినా అమలు కాలేదన్నారు.